# తప్పిపోయిన తండ్రి

శ్రీ గోవిందరాజు శ్రీనివాసమూర్తి

ఏనాటి మాట !

కాలగర్భంలో నాలుగు దశాబ్దాలు కలిసిపోయిం తర్వాత ఏనాటి అనుబంధ మిది !!

సన్నగా నవ్వుకుని టేబిల్ మూలకు విసిరేశాడు ఆ ఉత్తరాన్ని.

ఇది రెండో ఉత్తరం.

ఇక ఆ ఉత్తరాన్ని గురించి ఆలోచించలేదు రాజశేఖరం. ఆఫీసు పనిలో నిమగ్నమైపోయాడు.

రాత్రి భోజనాల దగ్గర భార్యతో ఈ విషయం ప్రస్తావించాడు.

"నాకో తండ్రి కుదిరాడు తెలుసా," అని. సావిత్రి పెద్దగా నవ్వేసి ఏమిటో తెలీక వెర్రిముఖం వేసింది.

"నా కర్థంకాని ఉత్తరం వచ్చింది ఇవాళ. నేను ఆయనకు కుమారుణ్ణట. నలభై యేళ్ల క్రితం గోదావరి వరదల్లో తప్పిపోయానట. కళ్ళల్లో వత్తులు వేసుకుని ఈ నలభై యేళ్లూ నాకోసం నిరీక్షించాడుట", అని నవ్వుకుంటూ చెప్పుకుపోతూంటే సావిత్రి విరగబడి నవ్వేసింది "భలే తండ్రినే సంపాదించారు" అంటూ.

ఈ సంఘటన జరిగిన నెల రోజుల తర్వాత మళ్లీ అలాంటిదే మరో ఉత్తరం వచ్చింది.

"నాయినా రాజా,

నేను మునుపు రాయించిన రెండు ఉత్తరాలూ అందాయని తలుస్తాను. నీవు జాబు రాయక పోవటంతో బాధ పడ్డాను. కళ్లు సరిగా కనిపించటంలేదు. నా కొడుకు ఇంతవాడయ్యాడని తెలుసుకున్న తర్వాత నా మనస్సే నిన్ను చిత్రించుకుంది. ఈ ముసలితనంలో దిక్కులేక జీవిస్తున్న నాకు దీపం చూపెట్టు తండ్రీ.

ఇట్లు,
నీ తండ్రి."

ఈ ఉత్తరం కలవరపెట్టింది రాజశేఖరాన్ని.

ఇత డెవరో తన తండ్రట. తనకు గుర్తున్నంతవరకూ తండ్రిని చూసెరగడు రాజశేఖరం. తన చిన్నప్పుడే తండ్రి మరణించడం లీలగా గుర్తు. తల్లి అంతకుమునుపే ఈ లోకం విడిచిపెట్టిందట. మేనమామ నారాయణరావు తనను పెంచడం, చదివించడం, అదృష్టంకొద్దీ తను మంచి ఉద్యోగం సంపాదించడం—అంతవరకే తనకు గుర్తు.—మ రీతండ్రెవరు ?—మేనమామ నారాయణరావూ ఇహ లోకం చాలించాడు. మరెవర్ని కనుక్కుంటాడు?

"చిరునామా పొరపాటై ఉండవచ్చు." చిరాకుతో చెత్త బుట్టలో పడేశాడు ఆ ఉత్తరాన్ని.

మరో ఇరవై రోజుల తర్వాత మళ్లీ ఒక ఉత్తరం వచ్చింది. 'కన్న కొడుకే ఖాతరుచేయని జీవితం ఎందుకంటూ.

ఈ ఉత్తరంతో భయం వేసింది రాజశేఖరానికి. ఇక ఊరుకోలేక పోయాడు. ఇది ముదిరితే చాల ప్రమాదం జరుగవచ్చు అనుకుని విసుగ్గా ఓ కార్డు రాశాడు.

"మీ రెవరో నాకు తెలియదు. పొరబడి ఉంటారు. క్షమించ ప్రార్థన."—మూడే మూడు ముక్కలు.

ఆరోజు సాయంత్రం భార్యతో ఈ ఉత్తరం గురించి ముచ్చటించాడు రాజశేఖరం.

పెద్దగా నవ్వేసింది సావిత్రి. ఆరేళ్ల కొడుకునీ దగ్గరకు తీసుకుని "మీ నాన్నగారు నీకో తాతని సంపాదించి పెట్టారు బాబూ" అంటూ తల నిమిరింది.

చిరాకేసింది రాజశేఖరానికి.

కాని, వారం రోజుల తర్వాత వచ్చిన ఉత్తరంతో కంపించిపోయాడు రాజశేఖరం.

"నాయనా రాజా,

నీ కార్డు చూసి ఎంత దుఃఖించానో ఆ భగవంతునకెరుక. కన్న కుమారుడే కనిపించని నా బ్రతుకెందుకో అర్థంకావటంలేదు. జీవచ్ఛవంలా నే నెవరికోసం బతుకుతున్నాను. నరసయ్య నీవు బతికున్నావని తెలిపిన రోజున ఎంత ఆనందించానో నీకు తెలియదు. ఎన్నడో కోల్పోయిన జవసత్వాలు తిరిగి నాలో ప్రవేశించినయ్. ఆనందం పట్టలేక వెర్రి కేకలతో ఊరంతా చాటి వచ్చాను, "నా రాజు బ్రతికే ఉన్నాడం" టూ.. నాయనా రాజా, నీకు జ్ఞాపకం ఉండి ఉండదు.. అప్పుడు నీకు ఆరేళ్ళు. తల్లిలేని నిన్ను కళ్లలో పెట్టుకున్నాను. కాని, కష్టాలనేవి మనకు చెప్పి రావు కదా! నీ మేనత్త కూతురు వివాహానికి వెళ్లి తిరిగి వస్తూంటే గోదావరిలో బోటు తలక్రిందులయి ఎటువారటు చెల్లాచెదు రయ్యారు. కన్న కొడుకుని దక్కించుకోలేని నిర్భాగ్యుణ్ణయాను నేను. గోదావరమ్మ నన్నే తనలో కలిపేసుకుంటే ఈ బాధలను చూసే దౌర్భాగ్యంలేకపోయేది కదా అని కుమిలి కుమిలి ఏడ్చాను. ఏనాటిదో ఈ కథ. ఇన్నాళ్లకు నరసయ్య వార్త పట్టుకొచ్చాడు.—నా రాజు బ్రతికే ఉన్నాడనీ, ఒక ఇంటి వాడయ్యాడనీ, నాకు ఒక మనుమడనీ—వింటూంటే ఏ లోకాల్లో విహరించానో నువ్వూహించలేవు రాజా. నా ఆరేళ్ల రాజే ఈ రాజశేఖరబాబనీ, ముఖంమీది ఆ మచ్చ ఎంతమాత్రం మారలేదనీ వింటూంటే మళ్లీ జీవితంమీద ఆశ పుట్టుకొచ్చింది.. నిన్ను చూడాలని ఎంత ఉవ్విళ్లూరుతున్నానో—వచ్చి ఒకమారు చూసివెళ్లు తండ్రీ."

పదే పదే ఈ ఉత్తరాన్ని చదువుకున్న రాజశేఖరానికి ముచ్చెమటలు పోసినై.

"ఇదేమన్నా నమ్మతగ్గ విషయమేనా. మామయ్య ఏనాడూ తన కిటువంటి విషయాలు చెప్పలేదే—ఇదేదో మోసం." అనుకున్న రాజశేఖరం ఈ ఉత్తరానికి జవాబు రాయలేదు.

పదిహేను రోజుల తర్వాత మళ్లీ ఒక ఉత్తరం వచ్చింది. ముసలితనంలో అండలేక చాల ఇక్కట్లు పడుతున్నాడట. దృష్టి సరిగా ఆనటంలేదట. భుక్తికి కూడ సతమత మవుతున్నాడట. వచ్చి చూసేందుకు వీలు లేకపోతే డబ్బేదైనా పంపాలిట.—అదీ ఉత్తరం సారాంశం.

సరిగా తాను ఊహించినట్టే అయింది. ఇది పచ్చి మోసం. డబ్బుకోసం పన్నిన వల. పచ్చగా ఉన్న తనను కాల్చేసే శక్తు లివి. నరసయ్యా, ఈ 'తండ్రీ' కలిసి పన్నిన కుట్ర యిది. లోకం మోసాల పుట్ట. చూచి పాదం మోపాలి—ఒక నిర్ణయానికి వచ్చి ఇంటికి మళ్లాడు రాజశేఖరం

సంగతంతా విన్న సావిత్రికి కూడా ఏమీ పాలుపోలేదు. ఇది దగా అని నమ్మింది.

"పోనీ ఆ డబ్బేదో పంపండి. ఇంతటితోనన్నా విరగడైపోతుంది. ఓ పాతిక రూపాయలు మనకేం ఎక్కువ కాదు గదా" అన్నది.

రాజశేఖరానికి కోపం తారస్థాయికి వెళ్లింది.

"ఇప్పుడో పాతిక అయితే, రేపు యాభై. దీనికి అంతే మిటి—పోలీసు రిపోర్టు ఇవ్వడమే తక్షణ కర్తవ్యం" అన్నాడు.

ఆ రాత్రంతా అతడిలో తుఫాను చెలరేగుతూనే ఉంది. "ఈ సమస్యను ఎలా విడగొట్టాలి." అదే అతనికి పట్టుకున్న సమస్య.

మర్రోజు ఆఫీసులో ఎంతో పనిలో నిమగ్నమయిన రాజశేఖరానికి చటుక్కున ఏదో గుర్తుకి వచ్చి మనియార్డరు ఫారం పూర్తిచేసి కట్టి రమ్మని పాతిక రూపాయలూ జవానుకిచ్చాడు. సాయంత్రానికి గాని తాను మనియార్డరు కట్టినట్టు గుర్తుకురాలేదు.

వారం రోజుల తర్వాత మనియార్డరు రశీదుతోబాటు ఓ ఉత్తరం కూడ వచ్చింది. డబ్బు అందుకున్నందుకు చాల ఉప్పొంగిపోయాననీ తన కొడుకు అండ ఉండగా తనకేం లోటనీ—వద్దామంటే లేవలేని పరిస్థితిలో ఉన్నాననీ ఏదేదో రాసేశాడు.

ఆరోజు రాత్రి సావిత్రితో ముచ్చటిస్తూ,

"ఇంకా నయం, వచ్చాడుకాదు," అన్నాడు రాజశేఖరం.

"ఏమో, కలల్లోకి రాకూడదా" అంది సావిత్రి.

ఇద్దరూ నవ్వుకున్నారు.

ఆ రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు రాజశేఖరానికి. కొంతసేపు ఏదో పుస్తకం తిరగేశాడు. కాని చదవ బుద్ధి పుట్టలేదు. పుస్తకాన్ని గిరవాటేసి సిగరెట్టు వెలిగించాడు. ఆలోచనలు పరిపరి విధాలుగా పోతున్నైన్.

"ఇత డెవరు ?—మోసం చేయటం మనిషికి సులువుగా చేతనైన పని. కాని, కాటికి కాళ్లు జాపుకున్న అతడికి ఇంకా జీవితంలో ఏ ఆశలు ఉంటై. నిజంగా అతని కొడుకు తప్పిపోయాడేమో పాపం, ఆ కొడుకు కోసం నిర్విరామంగా నలభైయేళ్లు నిరీక్షించి ఆఖరుకు కనుక్కున్నానన్న ధీమాతో అతని హృదయం ఎంత పొంగిపోతోందో! ఇప్పుడు ఈపరిస్థితిలో నేను అతడికి ఏమీ కానని తెలిస్తే ఎంత క్షోభ పడిపోతాడో."

కాని, అంతలోనే సరిపెట్టుకున్నాడు.

"లోకంలో బాధాపీడితులు ఎంతమంది లేరు ప్రేమ కోసం, ధనం కోసం ? బీదరికంతో ?—నానాజాతి సమితి ఈ లోకం. ఇన్ని రకాల మనస్తత్వాల్నీ ఏ ఒక్కడూ పరిష్కరించలేడు. లోకంలో అనేకమంది బిచ్చగాళ్ళు—అందరిని తృప్తిపరచగలమా ! ఏ ఒక్కణ్నో తప్ప .... పోనీ ఈ ఒక్కణ్ణి తను తృప్తిపరచగలిగితే ......

ఈ తలపు వచ్చేటప్పటికి మళ్లీ భయం వేసింది రాజశేఖరానికి.

మళ్లీ ఏవో కొత్త ఆలోచనలు.

పక్కలో అటూ యిటూ దొర్లాడు.

"నిజంగా నా తండ్రే బ్రతికిఉంటే !

ఈ వార్ధక్యంలో నామీద ఆధారపడక ఏం చూసుకుని బతుకుతాడు—కొడుకు వృద్ధిలోకి వచ్చి ప్రయోజకుడైతే మరేం కావాలి ఏ తండ్రికి—ఆ ప్రేమకు దూరమైన తనలో ఏదో లోటు కనుపిస్తూనే ఉన్నది. ఎంత సంపాదించినా ఆనందించేవా రెవరూ—కట్టుకున్న భార్య తప్ప—బంధువు లన్నవారు లేని తన జీవితమే తీరని లోటు .... "

బాధగా, మత్తుగా కళ్ళు మూసుకుని దిండులో తల దూర్చాడు రాజశేఖరం.

ఆ రాత్రి అతడిలో చెలరేగిన ఆలోచనలు ఆట్టే కాలం నిలువలేదు. పొద్దుటే మామూలు మనిషయ్యాడు—మళ్లీ, ఆఫీసూ, భార్యా, సంసారం ......

మరో నెల తిరిగింది.

ఆరోజు సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికి వెళ్లి కాఫీ తాగి మేడమీది వరండాలో పేపరు తిరగేస్తూ కూచున్నాడు రాజశేఖరం. మబ్బు పట్టి మెరపులు మెరుస్తున్నై. హెూరున వర్షం కురవచ్చు. చీకటి పడబోతోంది. ఆ మసగచీకట్లో ఒక మెరుపు వెలుగులో అతడికి కనబడిన దృశ్యం అతణ్ణి మళ్లీ కలవరపెట్టింది.

ఒక పదేళ్ల కుర్రవాడు తన తాతను కాబోలు చేయి పుచ్చుకుని నడిపించుకుంటూ వస్తున్నాడు. టపటప చినుకులు ప్రారంభమైనై. కుర్రవాడు వడివడిగా అడుగులు వేస్తున్నాడు, తాతకు దృష్టి సరీగా ఆనటం లేదేమో తొట్రుపడుతూ నడుస్తున్నాడు. బిచ్చగాళ్లలా ఉన్నారు. అలా నడిచి నడిచి తన ఇంటి గోడ పక్కనే ఉన్న చెట్టుకిందికి చేరారు. క్షణాల్లో ఆకాశం పగిలేట్టు మెరుపు మెరిసి కుంభవృష్టిగా వర్షం మొదలెట్టింది. చలికి తాత వణికిపోతూన్నట్టు ప్రతి మెరుపు లోనూ కనిపిస్తూనే ఉంది రాజశేఖరానికి—గబగబ మెట్లు దిగి క్రిందకు వచ్చి కుర్రవాణ్ణి కేకేసి లోపలకు రమ్మని పిలిచాడు. పిలిచిందే తడవుగా కుర్రవాడు పరుగెత్తుకుని లోని కొచ్చాడు. ఆ తొట్రుపాటులో తాత చేయి వదిలేశాడు. తాత పడతూ లేస్తూ కుర్రవాణ్ణి అనుసరించ ప్రయత్నిస్తున్నాడు. రాజశేఖరం ఒక్క అంగలో అతడి వద్దకు వెళ్లి చేయి పుచ్చుకుని వరాండాలోకి తీసుకొచ్చి ఓమూల కూచో పెట్టాడు.

మర్రోజు ఆఫీసుకు వెళ్లంగానే నౌఖరుకు యాభై రూపాయలూ ఇచ్చి మనియార్డరు కట్టి రమ్మని పంపాడు. ఇలా ఎందుకు చేశాడో అతడికే అర్థంకాలేదు.

సాయంత్రం సావిత్రితో ఈ సంగతి చెప్పాడు.

"పోన్లెండి, పాపం—సంతోషిస్తాడు," అన్నది సావిత్రి

తృప్తిగా కాఫీ త్రాగి పేపర్లో నిమగ్నమైపోయాడు రాజశేఖరం.

తాను జీతం పుచ్చుకున్న వెంటనే ఏదో గుర్తుకు వచ్చి యాభై రూపాయలూ మనియార్డరు కట్టివేస్తూనే వచ్చాడు. ఇందులో తాను ఏదో తృప్తి అనుభవిస్తూన్నట్టు ఫీలవుతున్నాడు. జీవితంలో తను కనీసం ఒక్కనికి మేలు చేస్తున్నాననీ—ఇది తన కనీస ధర్మమనీ సంతోషపడ్డాడు.

కాని ఈ సంతోషం ఆట్టే కాలం నిలువలేదు.

ఆరోజు సాయంత్రం హెూరున వర్షం కురుస్తూంది. ఆకాశం ప్రచండంగా విజృంభించింది. కారు అద్దంలోంచి రోడ్డే సరిగా కనుపించడంలేదు. ఎలాగో ఇంటికి చేరి వరండాలో అడుగుపెట్టాడో లేదో సావిత్రి అతడికి పిడుగులాంటి వార్త అందజేసింది.

"మీ తండ్రిగారు వచ్చారు" అని !

హృదయంమీద ఎవరో బలంగా గుద్దినట్టయింది రాజశేఖరానికి.

"ఏడీ ?" అన్నాడు కంగారుగా.

"హాల్లో ఉన్నారు." అంది సావిత్రి.

హాల్లోకి ఒక్క గంతు వేశాడు రాజశేఖరం.

తెల్లగా నెరసిపోయిన గడ్డంతో, జీర్ణ వస్త్రాలతో ఓ పండు ముసలి, తన కొడుకుని వీపుమీద ఎక్కించుకుని గుర్రం ఆట ఆడుతున్నాడు. కుర్రవాడు "తాతా, చల్, చల్" అని అదలిస్తున్నాడు.

రాజశేఖరాన్ని చూడగానే కుర్రవాణ్ణి మెల్లిగా కిందకు దింపి నడుం పట్టుకుని లేచాడు ముసలి.

"నాయనా, రాజా"—ఎక్కడో అగాధంలోంచి వచ్చినట్టు సన్నని శబ్దం.

"ఎవరు మీరు ?" అన్నాడు రాజశేఖరం. ఇది అడిగేందుకు అతడికి ఒక నిముషం పూర్తిగా పట్టింది. అతడి గొంతుక కూడ చాల కఠినంగా ఉంది.

"నాయనా రాజా—నేను .... నేను నీ తండ్రిని—రాజా. నలభై యేళ్ల తర్వాత నిన్ను చూస్తుంటే వళ్లు తెలియటం లేదు బాబూ .... ఏదీ నిన్నొకమాటు స్పృశించనీ .... " అని చాలా కష్టంతో చేయి పైకి ఎత్తగలిగాడు ముసలి.

గబుక్కున దూరంగా జరిగాడు రాజశేఖరం.

"మీ రెవరో నాకు తెలియదు. నేను మీ కుమారుణ్ణని ఇంతకాలం పొరపాటు పడ్డారు. నా తండ్రి ఏనాడో గతించాడు.—నేనా విషయం ఎరుగుదును ..... ఇంతకాలం మీకు డబ్బు పంపానంటే అది మీమీది జాలి తప్ప మరేంకాదు. ఎదుటికి వచ్చారు కాబట్టి ఆ జాలి కూడ ప్రస్తుతం కరిగిపోయింది." అన్నాడు రాజశేఖరం ఒక్క గుక్కలో.

తూలి పడబోయి మెల్లిగా నేల చూసుకుని చతికిలబడ్డాడు ముసలి.

"నాయనా రాజా .... ఎంతమాటన్నావు బాబూ—ఈ నలభై ఏళ్లూ జీవించింది ఈమాట వినేందుకేనా? అన్నీ మరచిపోయి జీవితాన్ని లాక్కువస్తున్న నాకు నీ కబురు చెప్పి నరసయ్య మళ్లీ నాలో చైతన్యం కలిగించాడు—నన్ను మళ్లీ పాతాళంలోకి తొక్కేయకు రాజా ...." అన్నాడు ముసలి. అతని కంఠం రుద్ధమై ఇక నోటంట మాటలు పెగలలేదు.

నరాలు స్వాధీనం తప్పినై రాజశేఖరానికి.

"నేను మీవాణ్ణి కాదని పదేపదే చెబుతూ వచ్చాను. జాలిపడి డబ్బు పంపాను..... ఇంతటితో మీకు తృప్తి లేనట్లయితే ఆ డబ్బుకు కూడ నోచుకోలేరు. మీదోవ మీది" అంటూ చరచర లోనికి వెళ్లిపోయాడు. సావిత్రి కూడ కంగారుగా భర్త ననుసరించి వెళ్లింది.

"పాపం, ఎన్ని ఆశలు పెట్టుకు వచ్చాడో—అంత కఠినంగా మాట్లాడి ఉండకూడదు" అన్నది.

"హు, మోసం చేయటం అంత తేలికనుకున్నాడేం !" —సావిత్రి మాట అతడు విన్నట్టు లేదు.

"ఇప్పుడు ఏంచేద్దా మంటారు!" అంది ఏంచేయాలో తోచక.

"ఏం చేసేందు కేముంది. గెంటేస్తాను." అంటూ విసురుగా హాల్లోకి వచ్చాడు రాజశేఖరం.

కుర్రవాడు కళ్లు నలుముకుంటూ,

"మరే .... మరే .... తాతే .... వెళ్లిపోయాడు ...." అన్నాడు.

ముసలి వరాండాలో కూడా లేడు.

రోడ్డుమీదకు పరుగెత్తాడు రాజశేఖరం.

హోరున వర్షం కురుస్తోంది. ఆ వర్షంలోనే రెండు మూడు సందులు వెతికాడు. ఇంటికి తిరిగివచ్చి నౌకర్ను వెంట తీసుకుని కారులో బయలుదేరాడు.

ప్రతి సందూ, మలుపూ—బస్ స్టాండూ, రైల్వే స్టేషనూ—అన్నీ గాలించాడు. నిరాశతో ఇంటికి మళ్లాడు.

పడుకోబోయే ముందు సావిత్రి అన్నది : "పాపం, ఎంత బాధపడ్డాడో—ఇంటికి వచ్చినవాణ్ణి, ఆదరం లేకపోగా కసిరి కొట్టారు."

"ఇక ఆ విషయం మాట్లాడకు సావిత్రీ," అని సిగరెట్టు వెలిగించాడు.

ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. 'తండ్రి' ని గురించే ఆలోచిస్తున్నాడు.

"పాపం—కొడుకుమీద ఎన్ని ఆశలు పెట్టుకున్నాడో. అతని కొడుకు నిజంగా తప్పిపోయాడేమో. లేకపోతే ఈ ముసలితనంలో నన్ను మోసం చేసేందుకు ఎందుకు ప్రయత్నిస్తాడు? ఇలా తరిమేయబడిం తర్వాత అతడి హృదయం ఫెటిల్లున పగిలిపోయిందేమో—అలా జరిగిన పక్షంలో నాకు నిష్కృతి లేదు.—ఇతడు నిజంగా నా తండ్రే అయితే ఇలా ప్రవర్తించగలిగేవాణ్ణా... నా కెవ రున్నారు ఈ లోకంలో ... ఒక ముసలిని—పోనీ నా తండ్రిలాగానే సాకలేనా ..... "

చూస్తూండగానే తెల్లవారింది.

వారం రోజుల తర్వాత ఒకటో తారీఖు వచ్చింది—అలవాటు చొప్పున యాభై రూపాయలూ మనియార్డరు కట్టాడు..

కాని దానికి రశీదు రాలేదు. మనియార్డరే తిరిగి వచ్చింది.

"ఈ అడ్రసుదారుడు చనిపోయినందున మనియార్డరు త్రిప్పి పంపడమైనది" అని రాసిఉంది ఫారంమీద.

కుర్చీలో కూలబడిపోయాడు రాజశేఖరం. తేరుకున్న క్షణంలో ఆఫీసుకు ఓ నెల రోజులు సెలవుపెట్టి ఇంటికి బయలుదేరాడు.

నెల రోజుల తర్వాత మళ్లీ ఆఫీసుకు వచ్చిన రాజశేఖరం జుట్టు పూర్తిగా తీసేయించిన విషయం గమనించిన ఆఫీసు నౌకరు విస్తుపోయాడు.